క్లుప్తంగా

బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఏలేశ్వరం: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గట్టిం వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం బూత్ కమిటీల ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అదేశాల మేరకు బూత్ స్వశక్తి అభియాన్‌లో భాగంగా ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ప్రవాస్ యోజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బూత్ కమిటీల ద్వారా గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, దాకే కృష్ణారావు, రెడ్డి లోవరాజు, కొప్పుల రాంబాబు, వరలక్ష్మి, దుర్గబాబు, వాడపల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన



గొల్లలగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంటలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కలిగే లాభాలను వివరించారు. పత్తి సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగు నివారణకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరి సాగు చేసిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొలం గట్లపై వంగ, మిర్చి, బంతి, మొక్కజొన్న, బొబ్బర, జొన్న, కంది, గోంగూర వంటి పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తుని గణపతినగర్ పార్కు రోడ్డులో తుప్పలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

తుని: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. పట్టణంలోని గణపతినగర్‌లో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న తుప్పలను తొలగించారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులు సోకవని ప్రజా ఆరోగ్యశాఖ అధికారి శేఖర్ సూచించారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శానిటేషన్ మేస్త్రీలు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల నిలువుదోపిడీ



తుని నుంచి ఆటోపై తీసుకొస్తున్న గ్యాస్‌బండలు

కోటనందూరు: గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. అసలే గ్యాస్ ధరలు పెరిగిపోయి ఉక్కిరిబిక్కిరి అవుతున్న వినియోగదారులను రవాణా చార్జీల పేరుతో ఏజెన్సీలు దోచేస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బండకు రూ.200 వరకూ తగ్గించి వినియోగదారులకు కొంతభారం తగ్గించినపుపటికీ గ్యాస్ ఏజెన్సీలు మాత్రం తగ్గడం లేదు. తునికి చెందిన సీతారామ, సమత గ్యాస్ ఏజెన్సీలు కోటనందూరు మండలానికి ఆటోలపై గ్యాస్ బండలను తీసుకొచ్చి సరఫరా చేస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఒక్కో గ్యాసబండకు రూ.20 రవాణా చార్జీలు తీసుకోవాల్సి ఉంది. కాని సరఫరాదారులు రూ.60 వసూలు చేస్తున్నారు. రూ.921 బండ ఖరీదు అయితే రూ.980 వసూలు చేస్తున్నారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ఒక్కొక్క ఏజెన్సీ వారానికి సుమారుగా వెయ్యి సిలెండర్లు వరకూ సరఫరా చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం పట్ల వినియోగదారులు మండి పడుతున్నారు.



జగ్గంపేటలో గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ఇగోకవరం సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్ట్‌లో గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఏలేశ్వరం గణపతి ఊరేగింపులో సందడి చేస్తున్న యువత

గంగమ్మ ఒడికి గణపతి

- వైభవంగా గణేశ్ నిమజ్జనాలు
- గ్రామాల్లో ఉత్సాహంగా ఊరేగింపులు
- సందడి చేసిన యువత, మహిళలు



తుని గణపతి ఊరేగింపులో భక్తుల కోలాహలం



ఎస్.పైడిపాలలో ట్రాక్టర్‌పై వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

తుని: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో గురువారం తుని తాండవ నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. స్థానిక కొట్టాం సెంటర్లో ఏర్పాటు చేసిన ర్యాంపు వద్దకు భారీగా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. బ్యాంకుకాలనీ, ఎంఆర్ పేట, ఎస్.అన్నవరం, అమ్మాజీపేట, రామకృష్ణాకాలనీ, పాత బజారు వీధి తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి తాండవ నదిలో నిమజ్జనం చేశారు. తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, మున్సిపల్ డీఈఈ ప్రకాశరావు, అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షించారు.

రౌతులపూడి: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, కోలాటం, తప్పిడగుళ్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారిని అంగరంగ వైభవంగా గ్రామాల్లో ఊరేగించి కాలువలు, నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సత్యదేవుని కాలనీలోని వినాయకుడి లడ్డూకు వేలం నిర్వహించారు. రౌతులపూడికి చెందిన బొడ్డు మరిడయ్య (చంటిబాబు) రూ.18 వేలకు వేలంలో సొంతం చేసుకున్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఏలేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా వినాయకుని విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలుచోట్ల నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి స్థానిక ఏలేరుదిలో నిమజ్జనం చేశారు. వర్షాన్ని లెక్కచేయకుండా ఊరేగింపులు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు.

జగ్గంపేట: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో గ్రామాల్లో నిమజ్జనాల సందడి నెలకొంది. జగ్గంపేట రావులమ్మనగర్‌లో మహిళలు ఏర్పాటు గణపతిని గురువారం పుష్కర కాలవలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు సందడి చేశారు.

బైబై గణేశా..

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా గురువారం వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గ్రామాల్లో వినాయకుని ప్రతిమలకు 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు ముగియడంతో కిర్లంపూడితో పాటు పలు గ్రామాల్లోని విగ్రహాలను డప్పులు, తీన్మార్ డ్యాన్స్‌లు, బాణసంచా కాల్పులతో వివిధ వాహనాలపై ఊరేగించి చెరువులు, ఏలేరు కాలువల్లోనూ నిమజ్జనం చేశారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపలి, అచ్చంపేట, కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో గురువారం గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. 11 రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు చేసి డప్పులు, తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట, యర్రయ్యపేట, కొత్తపేట, పంపాదిపేట, పెరుమాళ్లపురం గ్రామాల్లోని సముద్ర తీరాల్లో గురువారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పలు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను వివిధ వాహనాలపై ఊరేగింపుగా తీసుకొచ్చి సముద్రంలో నిమజ్జనం చేశారు. ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా పోలీసు సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా గురువారం గణపతి నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని గణపతి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి పంట చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. దారిపొడవునా భక్తులు స్వామి వారిని దర్శించుకొని కానుకలు సమర్పించారు.



కిర్లంపూడిలో గణపతిని ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితో జీఆర్పీ పోలీసులు

తుని: రైళ్లలో ప్రయాణికుల వస్తువులను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. రైల్వేపోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన అడపా వీర సత్య దుర్గారావు రైళ్లలో ప్రయాణికులకు చెందిన సెల్‌ఫోన్లు, బంగారు వస్తువులను అపహరిస్తాడు. వాటిని బయట మార్కెట్‌లో విక్రయిస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడినట్టు వివరించారు. నిందితుడిని తుని రైల్వేస్టేషన్‌లో పట్టుకుని అతని మూడు సెల్ ఫోన్లు, బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.55 వేలు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టుకు తరలించామన్నారు. కేసును ఛేదించిన ఏఎస్సై గోవింద్, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, మోహనరావు, కానిస్టేబుళ్లు రామకోటి, ఆదినారాయణలను ఎస్సై మారూఫ్ అభినందించారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ గురువారం తెలిపారు. ఏలేరు ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో సారా బట్టీలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఈబీ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలాల నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏలేశ్వరం గ్రామానికి చెందిన గెద్దాడ బాలరాజుపై పరారీ కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్సై బి. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కవి జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి



ఏలేశ్వరంలో గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: ప్రముఖ కవి గుర్రం జాషువాను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలో గురువారం జాషువా జయంతి నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిగా జాషువా చేసిన సేవలను కొనియాడారు. నేటి తరానికి జాషువా కవితలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో బంటుపల్లి అప్పారావు, ఉడతల రమణారావు, పూర నానాజీ, శిడగం రామకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో జాషువా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

గుర్రం జాషువా జయంతి

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆధ్వర్యంలో జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కళా, సాహిత్య రంగాలకు జాషువా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి ప్రకాష్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తలుపు తట్టి.. నాడి పట్టి..

- గ్రామాల్లో జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాల నమోదు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది
- రోగులకు ఏడు రకాల వైద్య పరీక్షలు
- 30 నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు



కిర్లంపూడి పీహెచ్‌సీ పరిధిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ నరసింహ నాయక్

కిర్లంపూడి: అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది..? తాతా రోజూ షుగర్ మాత్రలు వేసుకుంటున్నావా..? పెద్దాయాన బీపీ కంట్రోల్‌లోనే ఉంటుందా.. ? పెద్దమ్మ మన ఇంట్లో ఎవ్వరికైనా జలుబు, జ్వరాలు ఉన్నాయా ? అంటూ వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పల్లె బాట పట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి, జనం నాడి పడుతున్నారు. పల్లెల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను జోరుగా సాగుతోంది.

సర్వే ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో ఈ నెల 16 నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలకు సంబంధించి 7 రకాల పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని నిర్ధారణ చేస్తున్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయడంతో పాటు 10 సంవత్సరాల వయస్సు దాటిన వారందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు, రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న వారికి డెంగీ, మలేరియా, యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నిర్వహించే మెరుగైన వైద్యం కోసం టోకెన్‌లు జారీచేస్తున్నారు.

నియోజకవర్గంలో ఆరోగ్య సురక్ష శిబిరాల వివరాలు

మండలం	గ్రామాలు	సచివాలయాలు	శిబిరాలు
కిర్లంపూడి	21	26	23
గోకవరం	26	20	20
జగ్గంపేట	16	24	24
గండేపల్లి	18	18	17
మొత్తం	81	88	84



కిర్లంపూడిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పాట్లు పూర్తి చేశాం



గ్రామాల్లో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మండలంలోని 26 గ్రామ సచివాలయాలకు గాను 23 శిబిరాలను నిర్వహిస్తారు. రోగులకు నిర్వహించే వైద్య పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఎటువంటి ఆసౌకర్యం కలగకుండా శిబిరాల వద్ద తగిన సదుపాయాలు కల్పిస్తాం.

–బడే రాజేశ్వరరావు, కిర్లంపూడి ఎంపీడీఓ


సద్వినియోగం చేసుకోవాలి



గ్రామాల్లో ఈ నెల 30 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల శస్త్రచికిత్స వినియోగ వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్స్ అందుబాటులో ఉంచుతారు. స్థానిక పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులు, ఫ్యామిలీ డాక్టర్, స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు ఇతర సిబ్బంది ఈ వైద్య శిబిరాలకు హాజరవుతారు. అవసరమైన వారికి ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో నయంకాని పెద్ద చికిత్సలు అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–జె.నరసింహ నాయక్, డీఎంహెచ్ఓ, కాకినాడ

అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యం



అనారోగ్యం రహిత గ్రామాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ విధానం సత్ఫలితాలను ఇస్తోంది. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాల్లోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

– తోట రవి, ఎంపీపీ, కిర్లంపూడి

గ్రామాల్లో అన్నదానం

జగ్గంపేట: వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గురవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. జగ్గంపేటలో బావి చెరువు వద్ద, జయగారి వీధి, శివాజీ వీధి, జ్యోతుల కాలనీ, శ్రీరామనగర్ తదితర ప్రాంతాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొని వడ్డన చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులకు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

రాచపల్లిలో...

ప్రత్తిపాడు రూరల్: వినాయక చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాచపల్లిలో గురువారం అన్నదానం నిర్వహించారు. గణపతి మండలం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రామాల్లో చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఎస్.తిమ్మాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. ఎస్.తిమ్మాపురం, బూరుగుపూడి గ్రామాల్లో గురువారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంగా ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం పలువురు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ కె.భాస్కర్, ఎంపీహెచ్ఎస్ ఎస్. వెంకట రమణ, హెల్త్‌అసిస్టెంట్ అప్పారావు, నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం అరుణ పాల్గొన్నారు.

దానవాయిపేట సముద్ర తీరానికి రోడ్డు



దానవాయిపేటలో సముద్ర తీరం వరకూ నిర్మించిన రెండు లైన్ల సీసీ రోడ్డు

తొండంగి: మండలంలోని దానవాయిపేట బీచ్ రోడ్డు నుంచి సముద్ర తీరానికి సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం సెంటర్ నుంచి సముద్ర తీరానికి సుమారు రెండు కిలో మీటర్ల మార్గం ఉంది. దీర్ఘకాలంగా ఈ రహదారి మట్టి, ఇసుకతో ఉండటంతో రాక పోకలకు మత్స్యకారులతో పాటు హేచరీలకు వెళ్లేవారు, పర్వదినాల్లో సముద్రస్నానాలకు వచ్చే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు జెడ్పీ, పంచాయతీ రాజ్ నిధులతో పాటు దాతల సహకారం సుమారు రూ.40 లక్షలతో రెండు విడతలుగా సముద్రతీరం వరకూ సీసీ రోడ్డు నిర్మించారు. మొదటి విడతలో సముద్ర తీరం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వరకూ రెండు లైన్ల రోడ్డు నిర్మించగా రెండో విడతలో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పవన్ హేచరీ వరకూ సీసీరోడ్డు నిర్మించినట్టు సర్పంచ్ మడదా తిరుమల కుమారి తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో తమ కష్టాలు తీరాయని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ జగదీష్

గోకవరం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా గురువారం గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని పరిస్థితులపై పోలీసులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి స్మగ్లింగ్, సారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300 మందిని బైండోవర్ చేశామన్నారు. రాత్రి సమయాల్లో నేరాలు అధికంగా జరిగే ప్రదేశాలపై నిఘా పెట్టామన్నారు. గోకవరం కేంద్రంగా తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట సీఐ ఉమామహేశ్వరావు, ఎస్సై శివనాగ బాబు తదితరులు ఉన్నారు.